## క్లుప్తంగా

### మండల మీట్‌లో తాగునీటిపై చర్చ

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మహమూద్ అధ్యక్షతన మండల మీట్ నిర్వహించారు. కేవలం అరగంటలో పూర్తయిన ఈ సమావేశంలో ప్రధానంగా తాగునీటి ఎద్దడి నివారణ చర్యలపై చర్చించారు. జెడ్పీటీసీ శివన్న, వైస్ ఎంపీపీలు పప్పు క్రిష్ణవేణమ్మ, శోభా, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌వలి, ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డితో పాటు జేఈలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### గంగ జాతరకు పటిష్ట బందోబస్తు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు గంగమ్మ, గౌరమ్మల గంగ జాతర జరుగుతోంది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ములకలచెరువు సీఐ సాదిక్‌అలీ పర్యవేక్షణలో ఇద్దరు ఎస్‌ఐలతో పాటు 30 మంది కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొంటారని ఎస్‌ఐ మధురామచంద్రుడు పేర్కొన్నారు.

### పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి

పీలేరురూరల్ : ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని సహాయ కార్మిక సంక్షేమ అధికారి కె.ఆర్. ఆనంద బాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు, కేవీపల్లె మండలంలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జిరాక్స్ సెంటర్లు, నెట్‌పాయింట్లు తెరవరాదని తెలిపారు.

### కేవీకేలో నూనె యంత్రం

కలికిరి : స్థానిక కేవీకేలో నూనె గింజల నుంచి నూనె తీసే యంత్రం అందుబాటులో ఉన్నట్లు కేవీకే సమన్వయకర్త డాక్టర్ జీఎస్ పాండురంగ తెలిపారు. ఈ యంత్రం సాయంతో వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, కొబ్బరి నుంచి స్వచ్ఛమైన నూనె తీయవచ్చన్నారు. కిలోకు రూ.9 వంతున వసూలు చేసి నూనె తీసి ఇస్తామని కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జ్యోతి తెలిపారు. వివరాలకు 8520887745 నంబరులో సంప్రదించాలని ఆమె సూచించారు.

### ముదివేడు జాతరలో అన్నదానం

కురబలకోట : మండలంలోని ముదివేడులో ఘనంగా జరిగిన దండు మారెమ్మ జాతరలో ఆ గ్రామ సర్పంచ్ షహనాజ్ బేగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆమె తనయులు, స్థానిక నాయకులు ఎం.ఫిరోజ్‌ఖాన్, ఎం. అంజాద్‌ఖాన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### ఘనంగా శత చండీయాగం

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి శ్రీ గుంటి గంగమ్మ ఆలయంలో మంగళవారం శత చండీయాగం ఘనంగా నిర్వహించారు. అనంతపురం శివకోటి మహాలక్ష్మి పీఠం వ్యవస్థాపకుడు అప్పస్వామి శిష్య బృందం ఈ యాగం నిర్వహించారు. ఈనెల 16, 17 తేదీల్లో గంగమ్మ తిరునాల ఉంటుందని ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**నేటి నుంచి ఫస్ట్ ఇయర్ పరీక్షలు ప్రారంభం**

మదనపల్లె సిటీ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు పూర్తి చేశారు. మదనపల్లె పట్టణంలో 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కానుంది. 8.30 గంటలకే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల హాల్‌టిక్కెట్లు నంబర్లు, గదుల నంబర్లు బోర్డులో పెట్టారు. విద్యార్థుల కోసం తాగునీటి వసతితో పాటు ఆరోగ్య సిబ్బందిని నియమించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పాటు సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. విద్యార్థుల కోసం ఆర్టీసీ వన్,టు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ముందుగానే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని బాలకృష్ణమూర్తి తెలిపారు.



ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో పరీక్షకు ఏర్పాటు చేసిన గది

**ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం**

పీలేరురూరల్ : బుధవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ వెంకటరెడ్డి, వసంత, కస్టోడియన్ అధికారి కె. వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం పరీక్షా కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు పట్టణంలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలురు, బాలికల జూనియర్ కళాశాలలు, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొదటి సంవత్సరం 1228 మంది, ద్వితీయ సంవత్సరం 1051 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.

**పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు**

కేవీపల్లె : బుధవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రమణయ్య తెలిపారు. మంగళవారం గ్యారంపల్లె ఏపీఆర్‌ఎస్‌లో ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారంపల్లె పరీక్షా కేంద్రంలో మొత్తం 230 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉందన్నారు.

# సమష్టి కృషితో పోలింగ్ విజయవంతం

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టికృషితో, సమన్వయంతో పనిచేయడంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్‌శాతాన్ని పెంచి, పోలింగ్‌ను విజయవంతం చేయగలిగామని ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి పోలింగ్ వరకు నాయకులు అందరూ కలిసికట్టుగా పనిచేశారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రణాళికబద్ధంగా, సమన్వయంతో అందరినీ కలుపుకుని పోవడంతో పట్టణంలోని పోలింగ్ బూత్‌లలో గణనీయంగా పోలింగ్ శాతం పెరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఆదేశానుసారం క్రమశిక్షణతో పనిచేసి అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

# వైఎస్సార్ సంపూర్ణ పోషణ పారదర్శకంగా అందించాలి

కేవీపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పారదర్శకంగా అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ రాజమ్మ అన్నారు. మంగళవారం జిల్లేళ్లమంద సెక్టార్ పరిధిలోని గుండ్రేవారిపల్లె, గుట్టలపై, గొర్లకణంపల్లె, పెద్దతాండా, పేయలవారిపల్లె, పెండ్లిపెంట, పాళెంగడ్డ అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఉన్న ఫుడ్ స్టాక్ వివరాలు పరిశీలించారు. అనంతరం నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా పేయలవారిపల్లెలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతి

వాల్మీకిపురం : భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతి, ప్రపంచ సోషలిస్టు ఉద్యమకారుడు కార్ల్‌మార్క్స్ వర్ధంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని గండబోయనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఇద్దరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ ఒకే ఏడాదిలో ఐదు పరిశోధన పత్రాలను వరుసగా ప్రచురించి ఐన్‌స్టీన్ సైన్స్ చరిత్రలో తన శకాన్ని ప్రారంభించారన్నారు. ఆ పరిశోధనలు ఒక్కొక్కటి ఒక నోబెల్ బహుమతిని సాధించి పెట్టే స్థాయిలో ఉన్నాయని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు మురళి, శ్రీకాంత్, కిషోర్, మునిరాజ, శేఖర, మునిరత్నం, శ్రీలత, ఉషారాణి, సిరాజున్నీసా, శారద, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్యుకేషనల్ ఎపిఫనీ ఆన్‌లైన్ పరీక్షలో కోట విద్యార్థి ప్రతిభ

కురబలకోట : ఈ ఏడాది ఎన్‌జీఓ నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఎపిఫనీ ఆన్‌లైన్ పోటీ పరీక్షలో కురబలకోట మండల విద్యార్థులు ఇద్దరు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఏపీ మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి ఎ. మల్లికార్జున జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు ఎంఈఓ ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ యోజన గాంధి మంగళవారం తెలిపారు. ఈమేరకు పాఠశాల విద్యా కమిషనర్ నుంచి ఎనిమిది వేల రూపాయల నగదు, జ్ఞాపిక, మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. చింతమాకులపల్లె సచివాలయ పరిధిలోని సిద్దారెడ్డిగారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏడవ తరగతి విద్యార్థి ఎన్. డింపుల్ స్నేహిత రెడ్డి కూడా ఈ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. రూ.10 వేల నగదు, జ్ఞాపిక, మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నాడు. ఈ సందర్భంగా వీరిని ఎంపీపీ బి. దస్తగిరి, ఎంపీడీఓ దిలీప్ కుమార్, ఎంఈఓ ద్వారకనాథ్ అభినందించారు.



విద్యార్థి మల్లికార్జునను సత్కరిస్తున్న దృశ్యం

# కంటి జబ్బులపై అవగాహన కలిగి ఉండాలి

మదనపల్లె : కంటిజబ్బులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి అన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆస్పత్రి వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బందికి కంటిపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మాంజలిదేవి మాట్లాడుతూ.. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటివైద్యులు ప్రసాదరాజు, సుబహాన్, అబ్దుల్‌కలాంఆజాద్, సిబ్బంది పాల్గొన్నారు.



కంటివ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి

# 800 లీటర్ల సారా ఊట ధ్వంసం

కలకడ : మండలంలో 800 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు పీలేరు ఎస్‌ఈబీ సీఐ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఎనుగొండపాళ్యం, తాండ పంచాయతీలలోని దిగువతాండ పరిసర ప్రాంతాలలో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా నిల్వ ఉంచిన సారా ఊట 800 లీటర్లను ధ్వంసం చేశారు. అనుమానితులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడులలో ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య, ఈసీలు సుధాకర్, సురేష్ పాల్గొన్నారు.

# ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కలకడ : ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం మండలంలోని దేవులపల్లె పంచాయతీ బొజ్జగుంటపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ తనసిబ్బంది లక్ష్మీనారాయణ, ఖలీల్, శ్రీనివాసులు, సంజీవ, గురవయ్యలతో కలిసి దాడి నిర్వహించారన్నారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి పేకాట ముక్కలు, రూ.20,090 ని సీజ్ చేశామన్నారు.

# ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ మన సంస్థ. అందరూ కలిసి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలని స్థానిక 1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం డిపో కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్పెషల్ ట్రిప్పు సర్వీసులు, పల్లె వెలుగు బస్సుల్లో ఈపీకే పెంచాలని సూచించారు. ప్రయాణికుల కోసం అన్ని రూట్లలో బస్సులు తిప్పుతున్నామన్నారు. ప్రతి స్టేజీలో ఆపి ప్రయాణికులకు ఎక్కించుకోవాలన్నారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది రమణ పాల్గొన్నారు.

# తవళం పంచాయతీకి రూ.77వేల ఆదాయం

నిమ్మనపల్లె : చేపల చెరువు వేలంపాట ద్వారా తవళం గ్రామ పంచాయతీకి రూ.77వేల రూపాయల ఆదాయం లభించింది. మంగళవారం చేపల చెరువులకు ఎంపీడీఓ లీలామాధవి ఆధ్వర్యంలో తవళం గ్రామసచివాలయంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి బహిరంగ వేలం పాట నిర్వహించారు. తవళం గ్రామంలోని 12 చెరువులకు ఈ ఏడాది జూన్ 30 వరకు ఫలసాయం పొందేలా కాలపరిమితి విధిస్తూ వేలంపాటను నిర్వహించారు. సాకిరేవు ఒడ్డుచెరువును శ్రీరామపురానికి చెందిన కె.రమణ రూ.33,500కు, ఎర్రమరెడ్డిచెరువును ఉప్పరపల్లెకు చెందిన వెంకటరమణ రూ.42,500కు, దేవళంకుంటను లక్ష్మయ్య రూ.1,500కు వేలంపాటలో దక్కించుకున్నారు. వీటితో తవళం పంచాయతీకి మొత్తంగా రూ.77,500 ఆదాయం సమకూరిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మిట్స్ విద్యార్థులకు కేంబ్రిడ్జి ఇంగ్లిష్ బిజినెస్ సర్టిఫికెట్లు

కురబలకోట : అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పది మంది విద్యార్థులు కేంబ్రిడ్జి ఇంగ్లిష్ వారి బిజినెస్ సర్టిఫికెట్లు పొందినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ మంగళవారం తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఈ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి**

పీలేరు : చదువుతోపాటు విద్యార్థులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. మంగళవారం కోటపల్లె జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు ఉంటే ఎదుగుదల ఉండదన్నారు. ఒకటి నుంచి 19 సంవత్సరాలు లోపు వయస్సు కలిగిన పిల్లలందరు ఆల్బెండజోల్ మాత్రలు ఏడాదికి రెండు సార్లు వేసుకోవాలని సూచించారు. అలాగే అయ్యప్పరెడ్డికాలనీలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, తలపుల, రేగళ్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ సతీష్, హెచ్‌ఎంలు జయమ్మ, పద్మావతి, హెచ్‌ఈ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

# ఆస్పత్రులకు చేరిన ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్‌లు

మదనపల్లె సిటీ : ఏపీవీపీ ఆస్పత్రులకు కొత్తగా తయారు చేసిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో ఆరోగ్యమిత్రలు రోగులకు సరైన సమాచారం, ఆరోగ్యశ్రీ వివరాలు తెలియజేస్తారు.







# నులిపురుగుల నివారణతో చిన్నారులకు ఆరోగ్యం

**ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి**

మదనపల్లె : చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి తెలిపారు. పట్టణంలోని రామారావుకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నేషనల్ డీ వార్మింగ్ డేలో భాగంగా జరుగుతున్న అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 95,992 మంది చిన్నారులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రామారావుకాలనీ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయితేజ మాట్లాడుతూ.. భోజనం సమయంలో చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్ శాంతమ్మ, మహిళా పోలీస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రామారావుకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న పీడీ ధనలక్ష్మి



మాత్రలు మింగిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మి

కురబలకోట : పిల్లలు, విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని మండల వైద్యాధికారి కె. శ్రీధర్ అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలు, అంగన్‌వాడీలలో మాత్రలను పంపిణీ చేశారు.

పెద్దతిప్పసముద్రం : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కందుకూరు పీహెచ్‌సీలో డాక్టర్ శంకర్, పీటీఎం పీహెచ్‌సీలో డాక్టర్ పురుషోత్తం నాయక్‌లు చిన్నారులకు మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్నలతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రామసముద్రం : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నివారించేందుకు డీవార్మింగ్ డే నిర్వహించనున్నట్లు రామసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారిణి భార్గవి , చెంబకూరు వైద్యాధికారిణి శ్వేతారెడ్డి తెలిపారు. మంగళవారం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల, అంగన్‌వాడీలలో నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. సిబ్బంది శ్రీనివాసులు, రమాదేవి, హరినాథ్, వెంకటరమణ, పుణ్యవతి, శ్యామ్ పాల్గొన్నారు.

కలికిరి : 19 ఏళ్ల వయస్సు లోపు గల ప్రతి ఒక్కరు తప్పనిసరిగా నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేసుకోవాలని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. కలికిరిలోని మహిళల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించి విద్యార్థినులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ పద్మజ, ప్రిన్సిపాల్ అంజలీదేవి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. అలాగే గుట్టపాళ్యం గ్రామంలో సర్పంచ్ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌లు చిన్నారులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

నిమ్మనపల్లె : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్‌స్కూల్ కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను డాక్టర్ భానుప్రకాష్ నాయక్ పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఓ రామచంద్ర, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలకడ : మండలంలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లోని, జూనియర్‌కళాశాలోని విద్యార్థులకు కలకడ,ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డిలు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు.

మదనపల్లె సిటీ : మదనపల్లె డీవైఈఓ క్రిష్ణప్ప, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మిలు స్థానిక కోటవీధిలోని హోప్ మున్సిపల్ పాఠశాల, కృష్ణానగర్‌లోని కృష్ణ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులచేత మాత్రలు మింగించారు. ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, పీపీ యూనిట్ డాక్టర్ అనుపమ పాల్గొన్నారు.





